క్లుప్తంగా

కేడీసీసీబీ చైర్‌పర్సన్‌కు అభినందన



జి.కొండూరు: కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన చైర్‌పర్సన్‌గా గురువారం ప్రమాణస్వీకారం చేసిన తాతినేని పద్మావతికి జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ తాడిగడపలోని అన్నేవారి కల్యాణ మండపంలో జరిగిన ప్రమాణస్వీ కారోత్సవంలో పద్మావతిని మర్యాదపూర్వకంగా కలిసిన వారు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

సీజనల్ వ్యాధుల సర్వే



తిరువూరురూరల్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వైద్యారోగ్య సిబ్బంది సర్వే చేశారు. చౌటపల్లి, ఆంజనేయపురం, గానుగపాడు, కొత్తూరు, చింతలపాడు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యాన సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు సీజనల్ వ్యాధుల సర్వే చేస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మైలవరం: ప్రధాని మోదీ దుష్పరిపాలన నుంచి రైతులు, కార్మికులను కాపాడాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు తెలిపారు. మైలవరం రైతు సంఘం కార్యాలయంలో గురువారం రైతు కార్మిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రావూరి సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి చాట్ల సుధాకర్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చరణ్‌తేజ్, పాల్గొన్నారు.

రోడ్డు విస్తరించండి




కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో బ్రిటీష్ కాలంలో వేసిన ప్రధాన రోడ్డును విస్తరించాలని కలెక్టర్ ఢిల్లీరావును డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ కోరారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. కొండపల్లిలో సుమారు లక్ష వరకు జనాభా ఉన్నారని పూర్వం వేసిన రోడ్డు ఆక్రమణలతో కుచించుకుపోయిందని తెలిపారు. ఇది రాకపోకలకు ఆటంకంగా మారింది. బీ కాలనీ నుంచి ఎర్రబ్రిడ్జి వరకు విస్తరణ జరపాలన్నారు. మునిసిపాల్టీ ప్రత్యేకాధికారి, సబ్‌కలెక్టర్ అదితిసింగ్ తక్షణమే స్పందించి రోడ్డు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలలను భవిత కేంద్రాల్లో చేర్చాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగ బాలలను పాఠశాలల్లో చేర్పించాలని వివరిస్తూ గురువారం ముసునూరు సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులను, వారిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



ఇబ్రహీంపట్నం: స్థానిక విజయవాడ రూరల్ డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్ద రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రూరల్ డివిజన్ విజయవాడ జేఏసీ ఆధ్వర్యాన ఉద్యోగులు గురువారం నిరసన ప్రదర్శన జరిగింది. మధ్నాహ్నం భోజన విరామ సమయంలో చేపట్టిన కార్యక్రమంలో డివిజన్ జేఏసీ అధ్యక్షుడు శివరామ్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులపై యాజమాన్యం నిరంకుశ ధోరణి మానుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏడీఈ కొండలరావు, జేఏసీ కన్వీనర్ నాగేశ్వరరావు, కో–కన్వీనర్ శ్రీనివాసరావు, డివిజన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన రాకపోకలు



తిరువూరు తంగెళ్లబీడులో వరద నీరు



చిన్నంపేట తమ్మిలేరు వాగు బ్రిడ్జి వద్ద ప్రవాహం

తిరువూరు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలుచోట్ల రాకపోకలు నిలిపివేశారు. వర్షాల కారణంగా వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ రమేష్ సూచించారు. గురువారం ఆయన తిరువూరు సమీపంలోని పడమటివాగు వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. బలహీనంగా ఉన్న వంతెనల వద్ద రాత్రీ పగలు పోలీసులు కాపలా ఉండాలని, వరద తగ్గేవరకు వాహనాలను అనుమతించవద్దని తిరువూరు సీఐ భీమరాజును ఆదేశించారు. పట్టణంలోని తంగెళ్లబీడు, పాత తిరువూరులలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వగా, ఆర్టీసీ బస్టాండులో వర్షం నీరు నిలిచి ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

లంక గ్రామాల్లో..

ఇబ్రహీంపట్నం: ఎగువ ప్రాంతాల్లో అధికంగా కురిసిన వర్షాలకు జూపూడి సమీపంలోని ఉబ్బిడి వాగు పొంగి పొర్లుతోంది. దీంతో కృష్ణానది పాయలోకి భారీగా వర్షం నీరు చేరుతోంది. నదీ పరీవాహక ప్రాంతాలైన చినలంక, పెదలంక గ్రామాలకు వెళ్లే చప్టాపై భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. ఇక్కడ సుమారు ఐదు అడుగుల మేర నీరు చేరడంతో లంక గ్రామాలకు వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. సుమారు 350 కుటుంబాలు నివసిస్తున్న లంక గ్రామాల ప్రజలు గత్యంతరం లేక పడవలను ఆశ్రయించి ప్రయాణిస్తున్నారు.



తిరువూరు సమీపంలోని పడమటి వాగు వద్ద వరద పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

తిరువూరురూరల్: చౌటపల్లి వెదుళ్లవాగు కాజ్‌వేపై నీటి ఉధృతి కారణంగా పోలీసులు వాహనాల రాకపోకలను నిషేధించారు. అక్కపాలెం రోడ్డులో కూడా పడమటివాగుపై వంతెన శిథిలావస్థకు చేరడంతో వరదలు తగ్గేవరకు ద్విచక్రవాహనాలకు అనుమతి లేదు.

తమ్మిలేరుకు భారీ వరద

చాట్రాయి: తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో సీకేపాడు చానల్ ద్వారా మండలంలోని కోటపాడు, చిన్నంపేట గ్రామాల్లోని చెరువులు నిండి అలుగులు పడ్డాయి. తమ్మిలేరు రిజర్వాయర్‌కు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 4,500 క్యూసెక్కుల వరద నీరు చేరిందని, ప్రస్తుతం 346.5 అడుగుల నీటిమట్టం ఉందని ప్రాజెక్టు ఏఈ పరమానందం గురువారం చెప్పారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వెంకటాపురం బండెడ వాగు నుంచి చనుబండ పెద్ద చెరువుకు వరద నీరు చేరడంతో పూర్తిగా నిండింది. రేగడి వాగు, ఉప్పు వాగుల్లో వరద నీరు ప్రవహిస్తోంది.



చౌటపల్లి వద్ద రెవెన్యూ సిబ్బంది..



జూపూడి వద్ద లంక గ్రామాలకు వెళ్లే చప్టాపై చేరిన వర్షం నీరు

మణిపూర్‌లో అనాగరిక చర్యలపై నిరసన

నూజివీడు: మణిపూర్‌లో రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరుగుతున్న మారణకాండ, విధ్వంసాన్ని నిరసిస్తూ పట్టణంలో నూజివీడు యునైటెడ్ క్రిస్టియన్ సమాఖ్య ఆధ్వర్యాన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న అనాగరిక చర్యలను యునైటెడ్ క్రిస్టియన్ సమాఖ్య సభ్యులు తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవడంతో పాటు మారణహోమాన్ని నిలువరించాలని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా ఈనెల 31న సాయంత్రం 3 గంటల నుంచి పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కేటీ ప్రభాకర్‌రావు, స్టాన్లీ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో యునైటెడ్ క్రిస్టియన్ సమాఖ్య నాయకులు, సభ్యులు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: స్థానిక పురపాలక సంఘం పాలకవర్గ సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ గురువారం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మునిసిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు మొదటి విడత యూనిట్లు పంపిణీ

రెడ్డిగూడెం: మండలంలోని 24 యూనిట్లకు సంబంధించిన గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల పిల్లల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చేయనున్నట్లు ఏపీఎం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిగూడెం-4 యూనిట్లును రెడ్డిగూడెం ఎమ్మెస్ కార్యాలయంలో, రంగాపురం-9 యూనిట్లను వెలగలగూడెం, తాడిగూడెం గ్రామాల మధ్యలో పంపిణీ, రుద్రవరం-8 యూనిట్లు, నరుకుళ్లపాడు-2 యూనిట్లు, కుదప ఒక యూనిట్లను రుద్రవరం గ్రామంలో పంపిణీ చేస్తారని వివరించారు.

కార్నియాల సేకరణ

తిరువూరు: స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో గురువారం అనారోగ్యంతో మృతిచెందిన చక్రధరరావు అనే వ్యాపారి నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానమిచ్చినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. చక్రధరరావు కుటుంబసభ్యుల అంగీకారంతో నేత్రనిధి వైద్యులు కార్నియాలు సేకరించినట్లు తెలిపారు.

వినతిపత్రం అందజేత

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఐచ్ఛిక సెలవులు మంజూరు చేయాలని ఎంఈవో సీహెచ్ పుష్పలతను కోరారు. యూటీఎఫ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్మ్‌స్ట్రాంగ్, అధ్యక్షుడు కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది జూలై 28న మొహరం, ఆగస్టు 25 వరలక్ష్మీ వ్రతం, నవంబర్ 27 కార్తీక పౌర్ణమి, డిసెంబర్ 26 బాక్సింగ్ డే సందర్భంగా ఐచ్ఛిక సెలవులు మంజూరు చేయాలని కోరారు.

ఇంటింటికీ కుళాయి

చాట్రాయి: జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ జిల్లా కో–ఆర్డినేటర్ సిరిగిరి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో ఇంటింటికి కుళాయి పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ అంగారకల శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఓబిళ్లనేని సరోజనీ, పరసాసత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు ప్రోత్సాహకాలు

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ రవికుమార్

ముసునూరు: ప్రకృతి సేద్యంతో పంటలు పండిస్తున్న చిన్న, సన్నకారు ఎస్సీ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి అధ్యక్షతన గురువారం ప్రకృతి సేద్యం చేస్తున్న ఎస్సీ రైతులకు పీఎంఏజేఏవై కింద ప్రోత్సాహకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు 179 మందికి 10 రకాల నవధాన్యాలు, కిచెన్ గార్డెన్ కోసం 15 రకాల కూరగాయ విత్తనాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యులు వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ పెరుగుతున్న రోగాలను నివారించాలంటే పెట్టుబడి లేని, రసాయన ఎరువులు, మందుల వాడకం లేని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు పండించడం అవసరమన్నారు. ప్రతి ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో పెట్టుబడితో పని లేకుండా ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలను పెంచి, వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, గోపవరం సర్పంచ్ కంచర్ల వాణి, కార్యక్రమ కో–ఆర్డినేటర్లు కోటేశ్వరరావు, సుబ్బరాజు, అగస్టీన్, ఏ.ఓ మధుమోహన్, మండల ఇన్‌చార్జ్ బడుగు శారమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ముసునూరులో ఎస్సీ రైతులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్‌కలామ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త భారతరత్న అబ్దుల్‌కలామ్ అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేటలోని షేక్ ఆసిఫ్ కార్యాలయంలో అబ్దుల్‌కలామ్ వర్ధంతిని పురస్కరించుకొని నివాళి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. మిసైల్ మేన్ ఆఫ్ ఇండియాగా గణతికెక్కిన కలామ్ దేశంలో సాంకేతికరంగ అభ్యున్నతికి విశేషమైన సేవలందించారన్నారు. భారతీయ శాస్త్రసాంకేతిక రంగాల్లో ఆయన చూపించిన ప్రతిభ ప్రపంచంలో దేశ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేసిందని చెప్పారు. దేశాభ్యున్నతి కోసం పాటుపడ్డారని కొనియాడారు. మిసైల్ రంగం అభివృద్ధికి ఆయన ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. అత్యంత సామాన్యమైన కుటుంబంలో పుట్టి నిరంతర శ్రమతో దేశంలోనే అత్యున్నతమైన అధ్యక్ష పీఠాన్ని అందుకున్నారని వివరించారు. దేశంలోని యువత, విద్యార్థులను తన ప్రసంగాలతో నిరంతరం ప్రోత్సహించారన్నారు. ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉస్మాన్, ఫిరోజ్, మూర్తి, షవర్, మొయిన్, నయీమ్, లాల్‌అహ్మద్, సయ్యద్ హై, ఖాజా, జిలాని, యేసు తదితరులు పాల్గొన్నారు.



కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్

నేత్ర సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్ర సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కండ్లకలక రాకుండా ముందు జాగ్రత్తగా తీసుకునే హోమియో పిల్స్ పంపిణీ కార్యక్రమాన్ని కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంపిణీని ప్రారంభించిన డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ ప్రస్తుత సీజనల్ వ్యాధుల్లో ఒకటిగా కండ్లకలక నగరంలో బాగా విస్తరిస్తుందన్నారు. దీనివలన కొద్ది రోజులు విద్యార్థులు వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. వారి సమస్యలను గమనంలో ఉంచుకొని కండ్లకలక రాకుండా ఉండేందుకు హోమియో మందులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అలాగే కండ్లకలక వచ్చిన వారు నిర్లక్ష్యం చేయకుండా కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు వీఎస్‌రావు, డి.పవన్‌కుమార్, ఎస్.సాంబశివరావు, అధ్యాపకులు సీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్‌పై అవగాహన సదస్సు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఉద్యోగుల భవిష్య నిధి జిల్లా కార్యాలయం ఆధ్వర్యాన కొండపల్లిలోని ఐలా కార్యాలయంలో ప్రావిడెంట్ ఫండ్‌పై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. నిధి ఆప్కే నికత్(ప్రావిడెంట్ ఫండ్ మీ ముంగిట) కార్యక్రమంలో ఆ సంస్థ ప్రత్యేక అధికారి శేఖర్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈపీఎఫ్ సభ్యులు, యజమానులు, పెన్షనర్‌లకు భవిష్య నిధిపై అవగాహన కల్పించి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐలా చైర్మన్ ఎం.రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

ఆర్లపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం ఆర్లపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు విక్కుర్తి నరసింహారావును తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి పరామర్శించారు. నరసింహారావు తండ్రి విక్కుర్తి కృష్ణయ్య(72) గుండెపోటుతో ఇంటి వద్ద గురువారం మృతి చెందారు. కృష్ణయ్య మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి తన సంతాపాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు.

సీఐటీయూ నిరసన ప్రదర్శన

మైలవరం: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఎంపీడీఓ కార్యాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. దీనిలో భాగంగా మైలవరం మండల పరిషత్‌లోని అన్ని పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన ప్రదర్శించారు. అనంతరం ఎంపీడీఓ లక్ష్మీకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకురాలు వై.వీరమ్మ, దుర్గభవాని, రవి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేపై నిరంతర పర్యవేక్షణ

విజయవాడరూరల్: నియోజకవర్గంలో బూత్‌స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేపై నిత్యం సూపర్‌వైజర్ల పర్యవేక్షణ ఉండాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ (డెప్యూటీ కలెక్టర్) జి.వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు గురువారం విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మైలవరం నియోజకవర్గం సూపర్‌వైజర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నియోజకవర్గంలో 2, 63, 054 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బూత్‌స్థాయి అధికారులు వచ్చే నెల 21వ తేదీ వరకు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా ఓటర్ల జాబితాలను పరిశీలించడం, కొత్త ఓటర్ల నమోదు, ఇంట్లో లేని వారిని గుర్తించి వారుంటున్న ప్రాంతానికి మార్పు చేయడం, చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడంలాంటి విధులను నిర్వర్తిస్తుంటారని తెలిపారు. రెండు చోట్ల ఓటు ఉన్న వారిని ఓటర్ల అంగీకారంతో ఒక్కచోట మాత్రమే ఓటు హక్కును ఉంచుతారన్నారు. ఉద్యోగులకు, ఎన్ఆర్ఐలకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రత్యేకంగా ఓటర్ల రోల్‌ను నిర్ణయించాల్సి ఉంటుందని చెప్పారు. ఓటర్ల సర్వేలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్క సూపర్‌వైజర్ మీ పరిధిలోని బూత్‌స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు.

జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేసి ఓటర్లకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అసిస్టెంట్ ఎలక్ట్రోల్ అధికారి, తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సూపర్‌వైజర్ విధులను కచ్చితంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ హేమాప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు



సర్వే తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు

తిరువూరులో..

తిరువూరు: పట్టణంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వేను తహసీల్దార్ సురేష్‌బాబు గురువారం తనిఖీ చేశారు. రాజుపేట రెండో వార్డులో బీఎల్వోలు చేస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించిన తహసీల్దార్ త్వరితగతిన సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో ఓటర్ల చిరునామా, పేర్లు, పుట్టినతేదీ, ఇంటి నెంబరు తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏవైనా మార్పు చేర్పులుంటే యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆదినారాయణ, 15, 16 వార్డుల్లో జరిగిన సర్వేలో సచివాలయ కన్వీనర్లు, పోలింగ్ ఏజెంట్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

1,358 మందికి ధ్రువీకరణ పత్రాల పంపిణీ

చింతలనర్వ(గంపలగూడెం): గంపలగూడెం మండలం చింతలనర్వ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఇరవై ఒక్క సచివాలయాల పరిధిలో క్యాంపుల నిర్వహణను అధికారులు పూర్తి చేశారు. చింతలనర్వలో 706 మంది దరఖాస్తుదారులకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేసినట్లు ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి తెలిపారు. సర్పంచ్ గద్దల జాన్ కోటయ్య, ఎంపీటీసీ సభ్యులు జొన్నలగడ్డ మేరీ శాంతిలు దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు యనమద్ది కృష్ణయ్య, జొన్నలగడ్డ ప్రేమ్‌రాజ్, ఓబుల ఇంద్రరామయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ యాసారపు జ్యోతి, వీఆర్వో మూర్తి, కార్యదర్శి శివనాగమణి పాల్గొన్నారు.

దిగవల్లిలో..

నూజివీడు: దిగవల్లిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ కెత్తే నాని అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సొసైటీ ఆవరణలో సర్పంచ్, ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో 652 ధ్రువపత్రాలను స్థానికులకు అందజేశారు. సర్పంచ్ నాని మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో లోపాలను సరిదిద్దేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. తహసీల్దార్ డీవీఎస్ ఎల్లారావు, ఇతర శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దిగవల్లిలో జగనన్న సురక్షలో అధికారులు

పలుచోట్ల పొలాల పరిశీలన

ఏ కొండూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటకు పలు రకాల తెగుళ్లు సోకే అవకాశం ఉండటంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి టిప్పుసుల్తాన్ పేర్కొన్నారు. మండలంలోని రామచంద్రపురంలో సాగు చేసిన పత్తి పంటలను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలో గడ్డిజాతి కలుపు మొక్కలు అధికమవుతాయని వాటి నివారణకు ఎకరాకు 400 మిల్లీ లీటర్లు క్యాజిలో పాస్ ఇథైల్ 200లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రామచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

తిరువూరురూరల్: వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో నీట మునిగిన వరి పొలాలను తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ గురువారం పరిశీలించారు. వర్షం నీరు రోజుల తరబడి పొలంలో నిలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. నీటిలో వరినారుమళ్లు కుళ్లిపోతే తొలగించి మళ్ళీ నాట్లు వేయాలని తెలిపారు. మల్లేల రైతుభరోసా కేంద్రంలో ఎరువులు, పురుగు మందుల స్టాకు పరిశీలించారు.



పొలాల్లో వ్యవసాయశాఖ అధికారులు

ఆర్బీకేలో అందుబాటులో ఎరువులు

రెడ్డిగూడెం: స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా, డీఏపీ, 10–26–26 మందు కట్టలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ముసునూరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి మధుమోహన్ గురువారం తెలిపారు. యూరియా 83 మెట్రిక్ టన్నులు, డీఏపీ 49.25 టన్నులు, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం

నూజివీడు: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐలోని వివిధ ట్రేడ్‌లలో ఖాళీల భర్తీకి అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాధికారి డి.భూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 31 తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు ఒకటో తేదీ లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని వివరించారు. ఆగస్టు 3న ఉదయం 9 గంటలకు నూజివీడు ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని సూచించారు.

ఇంద్రకీలాద్రిపై ఘాట్ రోడ్డు పరిశీలన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఇంద్రకీలాద్రిపై గల దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానానికి వెళ్లే ఘాట్ రోడ్‌లో కొండ రాళ్లు పడిన ప్రదేశాన్ని దేవస్థానం పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు గురువారం పరిశీలించారు. ప్రస్తుతం ఘాట్ రోడ్‌లో రాకపోకలు నిలిపి వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన ఎక్కడైతే కొండ రాళ్లు పైనుంచి పడుతున్నాయి, ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేస్తున్న రక్షణ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.